క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై

జగిత్యాలక్రైం: ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ అన్నారు. జగిత్యాల పట్టణంలో బుధవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నందునా ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేసినట్లు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, కారులో ప్రయాణించేవారు తప్పకుండా సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సందాని, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల వర్క్‌షాప్‌లో భోగ శ్రావణి



వర్క్ షాప్‌లో పాల్గొన్న భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎలక్షన్స్ వర్క్‌షాప్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులకు దిశానిర్దేశం చేసినట్లు శ్రావణి తెలిపారు.

రైతులు నాణ్యమైన కందులు తేవాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన కందులు తీసుకరావాలని మార్క్‌ఫెడ్ అధికారి రామకృష్ణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు 12 శాతం తేమ ఉన్న కందులనే కొనుగోలు కేంద్రానికి తీసుకవచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి సురేందర్ సొసైటీ సీఈవో మంత్రి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు కాపాడాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెగడపల్లి: వన నర్సరీల్లో నాటిన ప్రతి మొక్కను కాపాడాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని నంచర్ల, దీకొండ గ్రామాల్లోని వన నర్సరీలను బుధవారం సందర్శించి మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్లాస్టిక్ సంచుల్లో మొలకెత్తని విత్తనాల స్థానంలో మళ్లీ నాటాలన్నారు. మొక్కల రక్షణకు షేడ్ నెట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామానికి 10 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామని, ఇప్పటి నుంచే స్థలాలు ఎంపిక చేసుకోవాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు వృత్తి విద్య నైపుణ్యాలను పెంపొందించుకోవాలని టాస్క్ శిక్షకులు కౌసల్య అన్నారు. బుధవారం మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల కోసం టాస్క్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి అవసరాలకు సెల్ఫ్ సిస్టమ్ ఇంటర్‌పర్సనల్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్క విషయాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రమోద్‌కుమార్, టాస్క్ కో–ఆర్డినేటర్ నీరజ, వైస్ ప్రిన్సిపల్ చంద్రయ్య, వాసవి, చంద్రయ్య, రాంచంద్రం, శ్రీలత పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?

- మధ్యలోనే నిలిచిన పనులు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించాలని విప్‌కు వేడుకోలు



సిరికొండ- తక్కళ్లపెల్లి గ్రామాల మధ్య వాగులో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులు

కథలాపూర్: మండలంలోని సిరికొండ- తక్కళ్లపెల్లి గ్రామాల మధ్య వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు మూడురోజుల ముచ్చటగానే ముగిశాయి. ఎనిమిదేళ్ల క్రితం గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన బ్రిడ్జి పనులు మధ్యలో ఆగిపోయాయి. నెల రోజుల క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ కొన్నిరోజులకే ఆపేయడంతో పనులు పూర్తి చేస్తారా లేదా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో రాకపోకలకు రెండు గ్రామాల ప్రజలు ఇక్కట్లపాలవుతున్నారు. సకాలంలో బ్రిడ్జి పనులు పూర్తయితే సమస్య తీరుతుందని ప్రజలు అంటున్నారు.

రూ. 6 కోట్లతో బ్రిడ్జి పనులు..

సిరికొండ- తక్కళ్లపెల్లి గ్రామాల మధ్య వాగు ఉండటంతో తక్కళ్లపెల్లి గ్రామస్తులు కథలాపూర్‌కు చేరుకోవాలంటే ఏళ్లుగా అష్టకష్టాలు పడుతున్నారని భావించి 2016లో అప్పటి ప్రభుత్వం రూ. 6 కోట్లు మంజూరు చేయగా ప్రజాప్రతినిధులు పనులు ప్రారంభించారు. పనులు చకచకా జరిగాయి. కొన్ని నెలల తర్వాత పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బ్రిడ్జి పనులపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టిసారించారు. నెలరోజుల క్రితం పనులను కాంట్రాక్టర్ ప్రారంభించి కొన్నిరోజులకే ఆపేయడంతో పనులు సాగుతాయా లేదా అని ప్రజల్లో సందేహం నెలకొంది. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేస్తే వచ్చే వర్షాకాలంలో ప్రజలకు రాకపోకలు ఇబ్బందులు తీరుతాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయమై రోడ్ల భవనాల శాఖ కథలాపూర్ క్లస్టర్ ఏఈ లక్ష్మీకాంత్ వివరణ ఇస్తూ.. త్వరలోనే పనులను పునః ప్రారంభిస్తామన్నారు. పనులు సకాలంలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచిస్తామని తెలిపారు.

కాలయాపన సరికాదు



బ్రిడ్జి నిర్మాణం పనులు ఏళ్ల తరబడి ఆగి.. మళ్లీ ప్రారంభం కావడంతో సంబరపడ్డాం. కొన్ని రోజులకే పనులు నిలిచి పోవడం దారుణం. పనులు జాప్యం చేయడంతో వాగులో నుంచి ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బ్రిడ్జి పనులపై అధికారులు నిర్లక్ష్యం చేయడం దారుణం. పాలకులు చొరవ చూపి బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయించాలి.

– జిల్లా రాజు, తక్కళ్లపెల్లి

రాకపోకలకు ఇబ్బంది



వాగులో నీళ్లుంటే రాకపోకలకు ఇబ్బందిపడుతున్నాం. వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడం అత్యవసరం. నిధులు మంజూరైన వాటికి ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం. కాంట్రాక్టర్ పనుల్లో నిర్లక్ష్యం చేస్తే అధికారులు చర్యలు తీసుకోవాలి. పనులను సకాలంలో పూర్తి చేయించడంపై పాలకులు, అధికారులు దృష్టిసారించాలి.

– ఏనుగు గంగారెడ్డి, సిరికొండ



ధర్మపురి: పట్టణంలోని పలు రోడ్లపై పశువులు తిరుగుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ధర్మపురి పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఇళ్లల్లో ఉండాల్సిన పశువులు రోడ్లపై ఉంటుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. గాంధీ, నంది కూడళ్లు, బస్టాండ్, కూరగాయల మార్కెట్‌లో పశువులతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పశువులను రోడ్లపై తిరగకుండా చూడాలని కోరారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి, సెల్ నంబర్: 9440635100

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

నియోజకవర్గానికి నిధులు మంజూరు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఎమ్మెల్యేను అభినందిస్తున్న ఎస్సీ నాయకులు

జగిత్యాల: నియోజకవర్గానికి అంతర్గత రహదారులు, మురికికాలువల నిర్మాణానికి రూ.9.92 కోట్ల నిధులు గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి మంజూరైనట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలో 2024–25 సంవత్సరానికి గాను ఎస్సీ ప్లాన్ కింద గ్రామాల్లో 247 పనులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులు సీతక్కకు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేకు అభినందన

శాసనసభలో ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై జగిత్యాల దళిత సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌చైర్మన్ గిరి నాగభూషణం, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్సీ నివాళి



నర్సవ్వ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జీవన్‌రెడ్డి

గొల్లపల్లి: మండలంలోని భీంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కందుకూరి నర్సవ్వ దశదినకర్మ జగిత్యాలలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో నిర్వహించగా, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరై శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పెద్ది శ్రీధర్– ప్రొఫెసర్ ఉషారాణి, న్యాయవాది రాచకొండ శ్రీరాములు–రమాదేవి దంపతులు, బ్యూరో ఇన్‌చార్జి అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, సురేందర్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కులగణన సర్వే ఆమోదం చరిత్రాత్మకం



ధర్మపురిలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్మపురి: కులగణన సర్వేను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం చరిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ దినేశ్ అన్నారు. బీసీ, ఎస్సీ కులగణనను చేపట్టడంపై హర్షిస్తూ ధర్మపురి పట్టణంలో బుధవారం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు వేముల రాజేశ్, చీపిరిశెట్టి రాజేష్, చిలుముల లక్ష్మణ్, అప్పం తిరుపతి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పెగడపల్లి: ప్రభుత్వం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులను బుధవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శాసన సభలో సభ్యులు ఆమోదించడంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

బిల్లుల ఆమోదం పట్ల హర్షం

కోరుట్ల: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ, కులగణన ఆమోదం పట్ల ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు టీపీఎస్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మల్లారెడ్డి, గంగారెడ్డి, బండారి శంకర్, షాహిద్ మహమ్మద్ షేక్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన ప్రతిష్టాత్మకం

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన దేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిలిచిందని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. కులగణన పూర్తి చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి చొరవ అభినందనీయమన్నారు. సీఎం, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్, మంత్రులు, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: సైబర్ నేరాలు, భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సైబర్ నేరాలు, భద్రతపై ప్రతినెలా మొదటి బుధవారం సైబర్ జాగృత దివాస్ పేరిట అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు పోలీసుశాఖ జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఓఎల్ఎక్స్ మోసాలు, ఏపీకే ఫైల్స్, నకిలీ కస్టమర్ కేర్ పేరిట మోసాలు జరుగుతున్నాయని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం: సైబర్ నేరగాళ్లపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అనిల్ తెలిపారు. మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లో తెలియని లింకులు వస్తే ఓపెన్ చేయవద్దని సైబర్ నేరగాళ్లు అనేక రకాల మోసాలు చేస్తున్నారని ఏ రకంగా మోసాలు చేస్తున్నారో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో రజిత, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఎండీ సజ్జనార్ ప్రశంసలు



ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో డీఎం సునీత, సిబ్బంది

జగిత్యాలటౌన్: గుండె పోటు వచ్చిన ప్రయాణికురాలిని కాపాడిన జగిత్యాల డీఎం సునీత, సిబ్బందిని బుధవారం హైదరాబాద్ బస్ భవన్‌లో ఎండీ సజ్జనార్ అభినందించారు. జనవరి 12న జగిత్యాల బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ఓ మహిళకు గుండెపోటు రాగా బస్టాండ్ విధులు నిర్వహిస్తున్న డీఎం సునీత వెంటనే అప్రమత్తమై ఆ మహిళకు సీపీఆర్ చేయించి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. ఇటీవల బస్సులో ఓ ప్రయాణికురాలు పెద్ద మొత్తంలో డబ్బులు, బంగారం ఉన్న బ్యాగును బస్సులో మరిచిపోగా గుర్తించిన డ్రైవర్, కండక్టర్ ఆ సొమ్మును డిపో మేనేజర్ వద్దకు చేర్చగా ప్రయాణికురాలిని గుర్తించి అప్పగించారు. డీఎం, ఆర్టీసీ సిబ్బంది సేవలను గుర్తించిన సజ్జనార్ వారిని సన్మానించారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగులు కవిత, ఎస్‌టీఐ శ్రీనివాస్, బీఆర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో యాదవులు సత్తా చాటాలి



నినాదాలు చేస్తున్న యాదవ నాయకులు

మల్యాల: యాదవుల అభివృద్ధికి తోడ్పడే నాయకుల వెంట నడవాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో యాదవులు తమ సత్తా చాటాలని యాదవ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. యాదవ సంఘం మండలాధ్యక్షుడు సంగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సాయి ఫంక్షన్ హాల్‌లో యాదవుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ యాదవులు ఏకతాటిపై నిలబడి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో యాదవుల జనాభా అధికంగా ఉన్న అన్ని స్థానాల్లో విజయం సాధించేందుకు ఐక్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తడుక హనుమంతు యాదవ్, నాగరాజు యాదవ్, గొట్టి నరేశ్ యాదవ్,, కొక్కుర మల్లేశం యాదవ్, సంగ సత్యనారాయణ, యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి నూతన కమిటీ



నూతన కార్యవర్గ సభ్యులు

వెల్గటూర్: ఎండపల్లి మండల దళిత హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల్ల భూమేశ్వర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మంతెన క్రాంతి, ఉపాధ్యక్షులుగా కనుకుంట్ల మల్లేశం, కిరణ్, ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల శంకరయ్య, సంయుక్త కార్యదర్శులుగా రాజేష్, అనిల్, కోశాధికారిగా కొరవేణి రాజు లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రాజు, స్వామి, రమేష్, రాజు, అంజి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ క్యాలెండర్ ఆవిష్కరణ

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేట ప్రాథమిక పాఠశాలలో స్టూడెంట్ క్యాలెండర్‌ను ఎంఈవో దామోదర్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానికి అనుగుణంగా కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జంగ గంగాధర్, సీఆర్పీ దేవారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త కుండీల్లోనే వేయాలి

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో బుధవారం పంచాయతీ అధికారులు దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు తెలపడంతో మురికికాలువల్లో స్ప్రే చేయించారు. ప్రజలు చెత్తా చెదారం ఇంటి ఆవరణలో వేయవద్దని, చెత్తకుండీల్లో వేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, కార్యదర్శి రవీందర్, సాగర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి అభినందన

జగిత్యాల: చైతన్య స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని హన్సిక తన అసాధారణమైన ప్రతిభతో తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అవార్డు సాధించింది. డ్యాన్స్‌లో తన అత్యుత్తమైన ప్రదర్శన ద్వారా ఈ అరుదైన ఘనత సాధించగా చైతన్య స్కూల్ కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్ హన్సికను అభినందించారు.

కులగణన పేరిట మోసం

కథలాపూర్: కులగణన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలను మోసం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ గౌడ్ ఆరోపించారు. బుధవారం కథలాపూర్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 92 శాతం ఉంటే వాటిలో కొత్తగా బీసీల్లో ముస్లింలు అని సృష్టించారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బడుగు బలహీనవర్గాల నాయకులు కృషి చేశారని, సీఎం రేవంత్‌రెడ్డి బడుగు బలహీనవర్గాలను నమ్మించి నయవంచన చేశారని దుయ్యబట్టారు. సమావేశంలో బీసీ సంఘం ప్రతినిధులు కాసారపు సతీశ్‌గౌడ్, జలంధర్, ప్రశాంత్, మామిడిపెల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు బోనాలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుకా ఎల్లమ్మతల్లి బోనాల మహోత్సవంలో బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని గీత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట అంకం సతీశ్, ధనేశ్వర్‌రావు, తిరుపతి, రాజు, మనోజ్ పాల్గొన్నారు.

హెచ్‌ఎం కుటుంబానికి పీఆర్టీయూ చేయూత

గొల్లపల్లి: పీఆర్టీయూ టీఎస్ సంఘ క్రియాశీల సభ్యుడు, లొత్తునూర్ పాఠశాల హెచ్‌ఎం ఉప్పరి గంగయ్య శుక్రవారం అనారోగ్యంతో మరణించగా, పీఆర్టీయూ టీఎస్ సంఘం నాయకులు రూ.లక్ష చెక్కును జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపల్లి ఆనందరావు, యాలాల అమర్‌నాథ్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సంది శ్రీనివాస్‌రెడ్డి, అయిల్నేని రత్నాకర్‌రావు, చీటి భూపతిరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చౌలమద్దిలో ఉచిత పశువైద్య శిబిరం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆవులు,గేదెలకు చూడి పరీక్షలు,గర్భకోశ వ్యాధి చికిత్సలు,దూడలకు నట్టల నివారణ,మందులు,గొర్రెలు,మేకలకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మెట్‌పల్లి మండల పశువైద్యాధికారి మనీషా తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బక్కయ్య, కోరుట్ల పశువైద్య కళాశాల ప్రొఫెసర్లు శకారం,అంబిక,శ్రీనివాస్,వైద్యులు హిమజ,అశోక్,తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని కొత్తబస్టాండ్ పార్కింగ్ పెద్ద కౌంటర్‌పై ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించిన వ్యక్తిని సీసీ పుటేజీ ద్వారా గుర్తించి పోలీసులకు అప్పగించారు. కొత్త బస్టాండ్ పార్కింగ్‌లో నాగేంద్రనగర్‌కు చెందిన కాసారపు రజినీకాంత్ పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం గొల్లపల్లికి చెందిన చంద్రయ్య అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనం తీసుకునేందుకు పార్కింగ్ సెంటర్‌కు వెళ్లాడు. రజినీకాంత్ తన సెల్‌ఫోన్ టేబుల్‌పై పెట్టి బైక్‌లను పరిశీలిస్తుండగా చంద్రయ్య కళ్లుకప్పి కౌంటర్‌పై ఉన్న సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. దీంతో సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి పోలీసులకు అప్పగించారు.

అదనపు కట్నం కేసు నమోదు

మల్యాల: అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్నారనే వివాహిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని మద్దుట్ల గ్రామానికి రష్మితకు మండల కేంద్రానికి చెందిన తాళ్ల ఆంజనేయులుతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల అదనపు కట్నం కోసం భర్త ఆంజనేయులు, అత్తామామలు వేధిస్తున్నారని ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేయి కోసుకున్న యువకుడు

కోరుట్ల: కోరుట్ల బస్టాండ్‌లో బుధవారం మధ్యాహ్నం చేయి కోసుకుని పడి ఉన్న యువకుడిని గుర్తించిన ప్రయాణికులు 108కు ఫోన్ చేయగా అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేయి కోసుకున్న యువకుడు మెట్‌పల్లికి చెందిన అమీర్ (26)గా గుర్తించారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అమీర్‌కు చికిత్స అందించిన అనంతరం బంధువులు ఇంటికి తీసుకెళ్లారు. ఈ విషయంలో తమకు ఫిర్యాదు రాలేదని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం

మల్యాల: మండల కేంద్రానికి చెందిన బైరి గంగమల్లు(60) అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. గంగమల్లు కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతోంది. గంగమల్లు భర్త బీరయ్య కూలీ పనికి వెళ్లగా, ఇంట్లో ఉన్న ఎవరూ లేని సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త బీరయ్య ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

7న ఇసుక వేలం

మెట్‌పల్లిరూరల్: అనుమతులు లేకుండా తరలిస్తుండగా పట్టుబడ్డ ఇసుక, సీజ్ చేసిన డంపుల ఇసుకకు ఈ నెల 7న వేలం నిర్వహించనున్నట్లు మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందస్తుగా రూ.10 వేలు దరావత్ చెల్లించాలని సూచించారు. ఇసుక అవసరాలు ఉన్న వారు ఆయా చోట్ల నిర్వహించే వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలకు నారసింహ ఆలయం ముస్తాబు



నరసింహ స్వామి ఆలయం

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్‌లో ఈ నెల 8 నుంచి 12 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ముస్తాబైంది. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలకంరించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న భగవత్ పుణ్యాహవచనం, నందదీప స్థాపన, స్వామి వారి తిరుక్కాళ్యాణ మహోత్సవం, అగ్ని ప్రతిష్ట, 9న నిత్యహోమం, బలిహరణ, తీర్థప్రసాద వితరణ, 10న కుంకుమార్చన, హోమం, సదస్య మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, 11న అన్న ప్రసాదం, దీపోత్సవం, ఎడ్లబండ్ల పోటీలు 12న స్వామివారి రథోత్సవం, స్వామివారి దర్శనం, ఏకాంతసేవ, తదితర కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ కడారి మల్లయ్య, కమిటీ సభ్యులు, నిర్వాహకులు కోరారు.